
# అన్యాయమైపోయావా భగవాన్!

ఆ రోజు జవరాత్రి.

జవదేవుడు ఆ రోజు రాత్రే పుట్టాడు.

భక్తులందరికీ పండుగరోజు జవరాత్రి. తనని కొలిచే భక్తుల శరీరాలకి లేని జవసత్వాలు చేకూర్చి నిత్యయవ్వనులుగా ఉంచే దేవుడు జవదేవుడు.




ఆరోగ్యానికి దేవుడు జవదేవుడు.

జవదేవుడు రాత్రిపూట పుట్టాడు కాబట్టే జవరాత్రి రోజు రాత్రుళ్లు జాగారం చేసి ఆయన్ని కొలుస్తారు భక్తులు. పగటి పూట ఉపవాసం ఎలాగూ తప్పదు.

ఆదినారాయణకి ఇష్టదైవం జవదేవుడు. నిత్యం అతను జవదేవుణ్ని ఎంతో భక్తి శ్రద్ధలతో కొలుస్తాడు.

ఆ రోజు భార్య సావిత్రి నిద్రలేపకముందే తనంతట తానే తెల్లారి లేచి గబగబా మొహం కడుక్కుని స్నానం చెయ్యడం కోసం గబగబా బాత్రూములోకి పరుగెత్తి, ఆ కంగారుకి కాలుజారి దడేల్‌మని పడి 'జవ జవా...!' అని భగవంతుణ్ణే తలచుకుని చన్నీళ్ళతో తలకి స్నానం చేశాడు.

బాత్రూమునుండి బయటికి రాగానే భార్యమీద విరుచుకుపడ్డాడు ఆదినారాయణ.

"నువ్వింకా ఇలానే ఉన్నావా?... త్వర్గా స్నానం చెయ్... జవుడి పూజ చేయాలి!!!.." కంగారు పెట్టేశాడు ఆదినారాయణ.

అతని బాధ తట్టుకోలేక బాత్రూములోకి కంగారుగా వెళ్ళిన సావిత్రికూడా కాలుజారి ధడేల్‌మని పడింది.

"ఏందబ్బా ఆ శబ్దం?... దేవుడు ప్రత్యక్షమైతే వచ్చినట్టు??..." అని ఆదినారాయణ ఆశ్చర్య పోతుండగానే సావిత్రి బాత్రూములోంచి రయ్యిన బయటికి వచ్చి ఆదినారాయణ్ణే బుర్రకాయ్ వాచేలా తిట్లు తిట్టింది.

"ఇట్టా కంగారు పెట్టేస్తే నావల్ల కాదంతే" అంటూ రయ్యిన బాత్రూములోకి వెళ్ళి ఆ విసురికి మళ్లీ జారి ధడేల్‌మని పడింది.

"జవ జవా ... పండుగపూట ఏంటి నాకీ ముక్క చీవాట్లు!" చెవులు మూస్కుంటూ బాధపడ్డాడు ఆదినారాయణ.

సావిత్రి స్నానం అయిన తరువాత ఇద్దరూ జవుడి పటం ముందు కూర్చొని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజ చేశారు.

పూజ అయిన తరువాత సావిత్రి ఇలా అంది: "ఏవండీ... రేడియో పెట్టండి... జవరాత్రికి సంబంధించిన స్పెషల్ ప్రోగ్రాంలు ఏమైనా వస్తాయేమో !..."

"నిజమే కదూ?... నా ఇష్టదైవం ప్రోగ్రాంలు వినకపోతే ఎలా?" అంటూ ఆదినారాయణ రేడియో పెట్టాడు.

"ఆహాకాష్వాణి... ఇప్పొడు జవరాత్రి పర్వదినం గురించి ఆచార్య సర్వమంగళం ప్రసగింస్తారు..."

ఇద్దరికీ తెలుసు... ఆ పర్వదినం ప్రత్యేకత గురించి!... అయినా రేడియోలో ఆ పర్వదినం గురించి విని తరలించుదామని చెవులు రిక్కించి వినసాగారు.

"శ్రోతలూ... జవరాత్రి పండగ సందర్భంగా మీ అందరికీ నా చుబాకాంచలు... ముందుగా జవుడెలా పుట్టాడు ఆ వైనం గురించి మనమందరం తెల్సుకుందాం... ఏం? ... అట్టాగేనా???... ఓసారి సరస్వతి బెమ్మదేవుడి ముందు కూర్చుని అదేపనిగా ఇసార రాగంలో వీణ వాయించేస్తుంది. హప్పొడు ఆ రాగాన్ని తట్టుకోలేక బెమ్మదేవుడు గిలగిల్లాడిపోయాడు. అట్టా గిలగిల్లాడిపోతున్న బెమ్మదేవుడి నొసలు మీద సెమట బిందువులు ఏర్పడ్డాయ్. హప్పొడు బెమ్మదేవుడు చూపుడు వేలుతో నొసలు మీది సెమట తీసి కిందికి దులిపినాడు. ఆ సెమట

బిందువులు కైలాస పర్వతం మీంచి కిందికి రాలసాగాయ్. అదే సమయంలో సుందర నందిని అనే గంధర్వ కన్య ఆకాశ మార్గాన విహరించసాగింది. బెమ్మ దేవుడు సెమట బిందువులు ఆ గంధర్వ కన్య పెదాలమీద పడ్డాయ్. అప్పుడు సుందర నందిని 'ఏంటబ్బా నా పెదాలమీద పడ్డాయ్' అని అనుకుంటూ నాలుకతో పెదాలమీద నాకింది. ఆమెకి ఆ సెమట బిందువులు సుగంధ పరిమళంతో అమృతం మించిన మాధుర్యంగా అనిపించాయ్. వెంటనే ఆమె చెకచెకా నాలుకతో పెదాల్ని నాక్కుని సెమట బిందువుల్ని మింగేసింది. బెమ్మదేవుడి సెమటని మింగిన కారణంగా సుందర నందిని గర్భవతి అయింది. సరిగ్గా తొమ్మిది నెలలకు సుందర నందిని పండంటి కొడుకుని కంది. ఆ బాబుకి బెమ్మదేవుడు సరస్వతి 'జవుడు' అని పేరు పెట్టారు..."

అలా ఆచార్య సర్వమంగళం జవుడి గురించీ, ఆ దేవుడు వెలసిన పుణ్యక్షేత్రాల గురించీ, జవుడి మహత్యాల గురించీ సుదీర్ఘమైన ప్రసంగం ఇచ్చాడు. ఆ ప్రసంగం వింటున్నంత సేపూ ఆదినారాయణ సావిత్రి "ఆహా... ఓహో.. మహాదేవా... జవ జవా..." అంటూ లెంపలేస్కోసాగారు.

ప్రసంగం అయిపోయింది.

"ఇంతవరకూ మీరు ఆచార్య సర్వమంగళం జవరాత్రి గురించి చెప్పగా విన్నారు ... ఇప్పుడు చిత్రరంగం. .. సిన్మాపాట్లు వింటారు..."

"హేవండేవండీ... కాస్త సౌండ్ పెంచండీ... సిన్మాపాట్లంటే నాకెంతిష్టమో... వింటాను..." అంది సావిత్రి హుషారుగా.

"నాకూ ఇష్టమే..." అన్నాడు ఆదినారాయం డబల్ హుషారుగా.

అతను రేడియో సౌండ్ పెంచాడు. "ఆ... కాష్వాణి... చిత్త్రరంగం... సిన్మాపాటల కార్యెక్రమం... ముందుగా మహాదేవ జవదేవ సిన్మాలో పాట వింటారు..."

"భంభం భంభం...
ఝుంఝుం ఝుంఝుం
జవదేవా...
నను బ్రోవగ రావా...
నీ మహిమ చూపించరా
మా మతి పోగొట్టరా..."

అసలు వాళ్లిద్దరూ "సన్నాసి మొగుడు", "దొంగెదవ" "చిలిపి బద్మాష్"... ఇట్టాంటి మంచి సినిమాల్లోని పాటలొస్తాయ్ కదా... విందాం అని సంబరపడ్డారు. కానీ మహాదేవ జవదేవా సిన్మాలోని పాటొచ్చింది.

పోన్లే... జవరాత్రి సందర్భంగా ఆ పాట వేశార్లే అని సరిపెట్టుకున్నారు.
"ఇప్పుడు తప్పకుండా 'తింగరి మింగరి పిల్లోడు'లోని పాటొస్తుంది చూడండి..." అంది సావిత్రి కళ్లెగరేస్తూ.
"ఏం కాదు ... నా అభిమాన నటుడు చెక్క మొహం చిన్నరావు నటించిన 'పెళ్ళామా ప్రేయసా?' సిన్మాలోని పాటొస్తుంది... చూస్కో..." అన్నాడు ఆదినారాయణ పాటకోసం కుతూహలంగా ఎదురుచూస్తూ.
"హిప్పుడు మా తర్వాతి పాట భక్తా భంభందాస్ లోనిది... ఈ పాట రచన..." చెప్తుంది అనౌన్సర్.
ముందుకు కూర్చున్న వాళ్లలా సాఫాలో వెనక్కి జారబడ్డారు. పాట మొదలైంది.

"రావా రావా దేవా
భక్తుల పాలిట కోవా
మా మొరలే వినుకోవా
మముగన్న మహానుభావా..."

తరువాత వచ్చిన పాటలన్నీ జవుడిమీద భక్తిపాటలే. ఆదినారాయణ, సావిత్రులు కాస్త మొహం చిట్లించారు.
"చిత్తరంగం... సిన్మాపాట్ల కార్యక్రమం ఇంతటితో సమాప్తం... ఇప్పుడు అక్కూరలు తింటే అయాసం వస్తుందా?... ఈ విషయం మీద డాక్టరక్ మేకారావుగారి ప్రసంగం వింటారు..."
"హబ్బా!... ఆ ప్రసంగం ఎవరు వింటాడ్లే... వివిద్భార్తి పెట్టండి... మంచి మంచి పాట్లు వినొచ్చు..."
"అవునవును... మంచి మంచి పాటలు వింటుంటే ఆకల్తెలీదు... అసలే ఉపవాసం ఉన్నాం కూడాను" అంటూ వివిద్భారతి ట్యూన్ చేశాడు ఆదినారాయణ.
అనౌన్సర్ గొంతు వినిపించింది. "మా జనభంజనిలో తర్వాతి పాట భంభందాస్‌లోనిది... రచన..." చెప్తున్నాడు అనౌన్సర్.
ఆదినారాయణ, సావిత్రీ బుస్సున నిట్టూర్చి సోఫాలో వెనక్కి వాలిపోయారు. పాట మొదలైంది.

"రావా రావా దేవా?
భక్తుపాలిట కోవా..."

పాట అయిపోయింది. తర్వాత అడ్వర్టైజ్‌మెంట్...
"రంగ్..."

"శ్రీబూత్‌రామ్ ప్రొడక్షన్స్‌వారి 'కాముడిగోల', జవరాత్రి సందర్భంగా జమాలకిడి జంజం సెవెన్టీ ఎమ్ఎమ్ థియేటర్లో అర్ధరాత్రి ఆట, తప్పకచూడండి, పసందైన డబుల్ మీనింగులున్న ఈ సినిమా దర్శకుడు బాతు బాలకృష్ణ, జవరాత్రి సందర్భంగా చూడండి,! చూసి తరించండి.... రంగ్..."
తర్వాత మళ్ళీ ఇంకోపాట.
"భంభం భంభం...
ఝుంఝుం ఝుంఝుం
జవదేవా
నను బ్రోవగరావా..."
ఆ తర్వాత ఇంకోపాట... ఒకదాని తర్వాత ఒకటి... అన్నీ చిత్రరంగం కార్యక్రమంలో వేసినవే. అవి వింటుంటే వాళ్ళిద్దరికీ పిచ్చెక్కి పోసాగింది. ఆదినారాయణ ఈసారి హైదరాబాద్ బి ట్యూన్ చేశాడు. అక్కడ అన్నీ ఇవే పాటలు... జవుడిమీదే! భక్తిపాటలు..
ఆదినారాయణకి విసుగెత్తి రేడియో కట్టేశాడు. ఒక గంటసేపు ఇద్దరు కబుర్లతో కాలక్షేపం చేసి మళ్ళీ రేడియో పెట్టారు. అప్పుడు రేడియోలోముత్తమామిడారం పుణ్యక్షేత్రంలో జవదేవుడి పూజా విశేషాలకి సంబంధించి ప్రత్యక్ష వ్యాఖ్యానం వస్తుంది.
పళ్లు గిట్టకరిచి రేడియో కట్టేశాడు ఆదినారాయణ.
"ఎంత జవరాత్రి అయితే మాత్రం పొద్దున్నుంచీ అదేపనిగా ఆ ప్రోగ్రాముల్తో చావగొట్టాలా? పండగ స్పెషల్ ప్రోగ్రాముగా ఒక అరగంటో, గంటో వెయ్యొచ్చుగా?..." అంది సావిత్రి పిడికిళ్ళు బిగించి.
అలా హైదరాబాద్ 'ఎ', 'బి', 'సి' స్టేషన్లలో సాయంత్రందాకా జవుడిమీద భక్తిపాటలు, జవుడికి సంబంధించి ప్రసంగాలూ, పూజా విశేషాలూ, ప్రత్యేక రూపకాలూ, నాటకాలూ అన్నీ వచ్చాయ్. ఆదినారాయణ సావిత్రిల తల వాచిపోయింది.
ఆ రోజు శనివారం. టి.వి.లో సాయంత్రం తెలుగు సినిమా వస్తుంది. ఆదినారాయణ టి.వి. పెట్టాడు. అప్పుడు జవుడిమీద నృత్య నాటిక వస్తుంది. ఆదినారాయణ పళ్లు కరకరా నూరాడు.
రూపకం అయిపోయింది. ఏం సినిమా వేస్తారోనని ఆతృతగా చూసారు సావిత్రి, ఆదినారాయణ.
"మరి కొన్ని క్షణాలలో 'జవరాత్రి మహత్యం' చలనచిత్రం చూస్తారు." పక పకా నవ్వుతూ చెప్పింది అనౌన్సరు.

ఆదినారాయణ, సావిత్రి వెనక్కి విరుచుకు పడిపోయారు.

ఆ రోజు మొదలు ఆదినారాయణ దంపతులకి జవుడంటే చచ్చేంత ఎలర్జీ ఏర్పడిపోయింది. ఆ రోజునుండీ జవుడిని పూజించడం మానేశారు వాళ్లిద్దరూ. వాళ్లేకాదు... రేడియోలు వినీ, టివిలు చూసిన అందర్కీ జవుడంటే ఎలర్జీ ఏర్పడిపోయి ఆ దేవుడికి పూజలు చెయ్యడం మానేశారు.

* * *